7

సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025

మార్కెట్లకు శ్రావణ శోభ 8లో





పూర్ణామార్కెట్ వద్ద రద్దీ



ప్రమాదస్థలం వద్ద సహాయచర్యలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఉలిక్కిపడిన విశాఖ

వెల్డింగ్ దుకాణంలో పేలిన సిలిండర్

- కంపించిన పాతనగరం
- రెండు కిలోమీటర్ల మేర పేలుడు శబ్దం
- ముగ్గురి మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు
- 9 అడుగుల ఎత్తయిన గోడ దాటి పడిన మృతుల శరీర భాగాలు
- షాపు వెనుక 150 అడుగుల దూరంలో ఉన్న ఇళ్లపై పేలుడు ప్రభావం
- ఓ ఇంట్లో సీలింగ్ పడి చిన్నారికి గాయం



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు యల్లాజీ, రంగారావు, సన్యాసిరావు, ఆస్పత్రిలో మృతిచెందిన ముత్యాలు

విశాఖ సిటీ/దాబాగార్డెన్స్ : విశాఖ నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. భారీ విస్ఫోటనంతో పాత నగరం భూకంపం వచ్చినట్లు అదిరింది. గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఫిషింగ్ హార్బర్ రోడ్డులో ఒక వెల్డింగ్ దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ పేలుడు ధాటికి ఇద్దరి వ్యక్తుల శరీర భాగాలు 9 అడుగుల ఎత్తయిన గోడపై నుంచి ఎగిరి అవతల పడ్డాయి. పేలుడు కారణంగా సంభవించిన మంటల్లో చిక్కుకున్న నలుగురు తీవ్రంగా కాలిపోయారు. దీంతో వన్‌టౌన్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రెండు కిలోమీటర్ల మేర ప్రజలను ఈ పేలుడు శబ్దం భయాందోళనకు గురిచేసింది.

చెల్లాచెదురైన శరీర భాగాలు

సున్నపువీధి ప్రాంతానికి చెందిన చల్లా గణేష్(44) వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆరు నెలల క్రితమే బుక్కా వీధిలో ఫిషింగ్ హార్బర్ రోడ్డులో వెల్డింగ్ దుకాణాన్ని తెరిచాడు. ఒడిశాకు చెందిన శ్రీను హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం హెల్పర్ శ్రీను(29)తో పాటు మరో ఇద్దరు



మృతదేహాలను తరలిస్తున్న స్థానికులు



రోదిస్తున్న మృతులు, క్షతగాత్రుల బంధువులు

వర్కర్లు ఎర్ర ఎల్లాజీ(45), సన్యాసిరావు(46)లను పనికి పెట్టుకున్నాడు. వీరు ఎప్పటిలాగే వెల్డింగ్, గ్యాస్ కటింగ్ పనులు చేస్తుండగా సాయంత్రం 4.30 గంటలకు సిలిండర్ పేలిపోయింది. అక్కడే ఉన్న యజమాని గణేష్, హెల్పర్ శ్రీనుల మృతదేహాలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. వెల్డింగ్ షాపు నామరూపాలు లేకుండా తునాతునకలైంది. పేలుడు ధాటికి మంటలు వ్యాపించాయి. అక్కడే పనిచేస్తున్న వర్కర్లు ఎర్ర ఎల్లాజీ, సన్యాసిరావుతో పాటు పక్కన ఉన్న స్క్రాప్ దుకాణంలో పనిచేస్తున్న చింతకాయల ముత్యాలు(27), ఇప్పిలి రంగారావు(53) ఆ మంటలకు తీవ్రంగా గాయపడ్డారు.

ఆటోలో క్షతగాత్రుల తరలింపు

భారీ ప్రమాదం జరిగినప్పటికీ ఘటనా స్థలానికి 108 అంబులెన్సులు రాకపోవడం గమనార్హం. కేవలం మృతదేహాల తరలింపు కోసం మాత్రమే అంబులెన్సును తీసుకొచ్చారు. నలుగురు క్షతగాత్రులను ఆటోలో తరలించడంపై స్థానికులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంటల్లో 90 శాతానికి

మృతులు
చల్లా గణేష్(44), శ్రీను (29), చింతకాయల ముత్యాలు(27)

క్షతగాత్రులు
ఎర్ర ఎల్లాజి(45), టి.సన్యాసిరావు(46), ఇప్పిలి రంగారావు(53)

పైగా కాలిన శరీరంతో బాధను తట్టుకోలేక.. ఆర్తనాదాలు పెడుతూ ఆటో ఎక్కడం అక్కడున్న వారందరినీ కలిచివేసింది.

ఇద్దరి పరిస్థితి విషమం

ఘటనా స్థలంలోనే ఇద్దరు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఎర్ర ఎల్లాజీ(45), సన్యాసిరావు(46), చింతకాయల ముత్యాలు(27), ఇప్పిలి రంగారావు(53)లను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. వీరిలో చింతకాయల ముత్యాలు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మరణించాడు. ఎల్లాజీ 95 శాతం, రంగారావు 75 శాతం మేర కాలిపోయారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. 18 శాతం కాలిన గాయాలైన సన్యాసిరావును చికిత్స కోసం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు.

కంపించిన ఇళ్లు.. చిన్నారిపై పడిన సీలింగ్

ఒక్కసారిగా భారీ శబ్దంతో భూమి అదరడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో సుమారు 200 మీటర్ల వరకు ఉన్న ఇళ్లు కంపించాయి. వెల్డింగ్ దుకాణానికి 150 అడుగుల దూరంలో ఉన్న ఒక ఇంట్లో సీలింగ్ కూలింది. ఆ ఇంట్లో గాయత్రీ అనే చిన్నారి(11)పై ఆ పెచ్చులు పడ్డాయి. దీంతో ఆమె తలకు గాయమైంది. మరికొన్ని ఇళ్లు కూడా స్వల్పంగా దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఘటనా స్థలానికి అధికారులు

ఘటనా స్థలాన్ని కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జేసీ మయూర్ అశోక్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సందర్శించారు. అక్కడ ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు క్షతగాత్రులకు అందిస్తున్న వైద్యం గురించి వివరించారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

పని దొరికింది.. హ్యాపీ అన్నాడు..



ప్రమీలా పని దొరికింది. ఇంత కాలం ఖాళీగానే ఉన్నా. ఇక మనకు పర్వాలేదు. హ్యాపీ అంటూ వెళ్లిన తన భర్త, పేలుడు ఘటనలో గాయపడి చికిత్స పొందుతూ మరణించడంతో చింతకాయల ముత్యాలు భార్య ప్రమీల కేజీహెచ్ మార్చురీ వద్ద వెక్కివెక్కి గుండెలవిసేలా రోదించింది. ఆమెను ఓదార్చడం ఎవరితరం కాలేదు. అర్థంతరంగా వదిలి వెళ్లిపోయావు నాయనా.. పిల్లల్ని ఎవరు చూస్తారంటూ ప్రమీల తల్లి(ముత్యాలు అత్త) వేదన అంతా ఇంతా కాదు. పోస్టుమార్టం కోసం మార్చురీకి తీసుకెళ్తుండగా ముత్యాలు మృతదేహాన్ని చూసి ప్రమీల సొమ్మసిల్లిపోయింది. వీరు ఇద్దరు పిల్లలతో బుక్కా వీధిలో ఉంటున్నారు.

అనాథలయ్యాం..



లోలోర 365 వర్క్‌షాప్‌ను 6 నెలల కిందట అప్పు చేసి రూ.3 లక్షలకు గణేష్ తీసుకున్నాడు. అంత వరకు టౌన్‌కొత్తరోడ్డు సమీపాన ఓ దుకాణంలో పనిచేశాడు. సొంతంగా దుకాణం పెట్టుకోవడంతో పాటు పలువురికి ఉపాధి కల్పించాడు. ఆరు నెలల్లోనే భగవంతుడు తమ నుంచి దూరం చేశాడంటూ గణేష్ భార్య సుధ రోదించిన తీరు అక్కడున్నవారిని కలచివేసింది. సున్నపువీధిలో ఉంటున్న వీరికి టెన్త్ చదువుతున్న లక్ష్మీసంపత్, 8వ తరగతి చదువుతున్న వర్షిత్‌శ్రీ ఉన్నాడు.

ఒంటరైన శ్రీను భార్య

ఇదే వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన శ్రీను కూడా మృతి చెందాడు. ఆరేళ్ల కిందట బతుకుతెరువు కోసం విశాఖ వచ్చిన శ్రీను బుక్కావీధిలోనే అద్దెకు ఉంటూ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. శ్రీను మరణంతో భార్య ఒంటరయింది.

- ఘటనలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఇప్పిలి రంగారావు(53) బుక్కావీధి, ఫిషింగ్ హార్బర్ రోడ్డులో స్క్రాప్ దుకాణం నడుపుతున్నాడు. తెలకలవీధి, చెంగల్రావుపేటలో నివాసం ఉంటున్నాడు. రంగారావు పెద్ద కుమారుడు జై నగరంలోని పోర్టు ట్రస్ట్‌కు సమీపాన ఓ స్క్రాప్ దుకాణం నడుపుతుండగా, రెండో కుమారుడు నవీన్ పారిస్‌లో బీబీఏ చదువుతున్నాడు. మూడో కుమారుడు గౌరీశంకర్ సీమెన్. భార్య భారతి గృహిణి. రంగారావు పరిస్థితి క్రిటికల్‌గానే ఉందని వైద్యులు తెలిపారు.
- లోలోర 365 వర్క్‌షాప్ యజమాని గణేష్ వద్ద పని చేస్తున్న యర్రా ఎల్లాజీకి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్తున్నారు. ఎల్లాజీ భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులతో మధురవాడలో ఉంటున్నాడు. పెద్దకుమారుడు గణేష్ ఫౌండ్రీలో పనిచేస్తుండగా, చిన్నోడు హరికృష్ణ ఏసీ మెకానిక్.

అరగంట దాటి ఉంటే..

రోజూ సాయంత్రం 5 గంటల సమయంలో లోలోర 365 వర్క్‌షాప్(గణేష్ దుకాణం) వద్దకు పరిసర దుకాణాల నుంచి పదుల సంఖ్యలో చేరుకుంటారు. కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకునేవారు. దుర్ఘటన అరగంట ముందుగా జరగడంతో చాలా మంది ప్రాణాలు దక్కినట్లేనని స్థానికులు 'సాక్షి'కి తెలిపారు.

భూమి అదిరింది..



సాయంత్రం 4.30 సమయంలో ఇంటి పనులు చేసుకుంటున్నాం. ఒక్కసారిగా పెద్ద సౌండ్ వచ్చింది. భూకంపం మాదిరి భూమి అదిరింది. పై ఫ్లోర్‌లో ఉన్న నేను భయంతో కిందికి వచ్చేశాను. పక్కనే నల్లటి పొగ కనిపించింది. ఇంతలో వెల్డింగ్ షాపు నుంచి పొగలు కమ్ముకున్నాయి. పెద్ద పెద్ద అరుపులు, ఆర్తనాదాలు వినిపించాయి. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పిన తర్వాతే గ్యాస్ సిలిండర్ పేలినట్లు తెలిసింది. – స్థానికురాలు

ఏ సిలిండర్ పేలింది?

ఘటనా స్థలంలో ఆక్సిజన్ సిలిండర్లతో పాటు డొమెస్టిక్ సిలిండర్ కూడా ఉంది. వీటిలో ఏ సిలిండర్ ప్రమాదానికి కారణమైందన్న విషయం తేలాల్సి ఉంది. సాధారణంగా డొమెస్టిక్ సిలిండర్ పేలితే అది ముక్కలైపోతుంది. కానీ అక్కడ ఉన్న సిలిండర్ బాగానే ఉంది. అలాగే ఆక్సిజన్ సిలిండర్లు మూడు ఉండగా.. ఒకదానికి మాత్రం పైన వాల్వ్ పడిపోయి ఉంది. సాధారణ సిలిండర్ కంటే ఆక్సిజన్ సిలిండర్ పేలుడు కారణంగానే భారీగా విస్ఫోటనం సంభవిస్తుంది. చదరపు ఇంచ్‌కు 2 వేల పౌండ్ల ఒత్తిడితో సంభవించే ఈ పేలుడుకు భారీ నష్టం వాటిల్లుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ సిలిండర్ పేలితే మాత్రం 5 మీటర్ల పరిధిలో ఉన్న వారికి మృత్యు ప్రమాదం ఉంటుందని, గరిష్టంగా 32 మీటర్ల దూరంలో ఉన్న వారికి గాయాలయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. దీని ప్రకారం ఈ ఘటనలో ఆక్సిజన్ సిలిండర్ పేలిందా? లేదా గ్యాస్ సిలిండర్ ప్రమాదానికి కారణమైందన్నది విచారణ చేయాల్సి ఉందని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



ప్రమాద స్థలం వద్ద ఆక్సిజన్ సిలిండర్లు, డొమెస్టిక్ సిలిండర్, సిలిండర్ వాల్వ్

తీవ్రంగా కలచివేసింది: బొత్స

గ్యాస్ సిలిండర్ పేలుడు ప్రమాదంలో ముగ్గురు చనిపోవడం తనను తీవ్రంగా కలచివేసిందని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

ప్రమాదంపై కేకే రాజు దిగ్భ్రాంతి

గ్యాస్ సిలిండర్ పేలుడు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడంపై వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఫ్రీ బస్ అమలుకు సర్వం సిద్ధం

- పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో, ఆర్డినరీ బస్సుల్లో ఉచితం
- మీడియాతో ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ కె.నారాయణ

మహారాణిపేట: ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఏపీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ల నారాయణ, జోనల్ చైర్మన్ దొన్నుదొర తెలిపారు. ద్వారకా బస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలు ఎక్కడ నుంచి ఎక్కడికైనా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఆధార్, ఓటర్ ఐడీ, ఇతర గుర్తింపు కార్డులు తప్పనిసరిగా చూపాలని పేర్కొన్నారు. త్వరలో మరో 1050 కొత్త బస్సులు రానున్నాయని, ఏటా డీజిల్ బస్సుల స్థానంలో కొత్త ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆర్టీసీ చైర్మన్ నారాయణ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రారంభిస్తున్న ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అదనపు బస్సులు, సిబ్బందిని సమకూర్చినట్లు పేర్కొన్నారు. తొలి రోజుల్లో ఎదురయ్యే సమస్యల్ని పరిగణనలోకి తీసుకుని దిద్దుబాటు చేసుకుంటామన్నారు. జోనల్ చైర్మన్ దొన్ను దొర మాట్లాడుతూ రాష్ట్రంలో బస్సు ప్రయాణికుల మొత్తం సంఖ్యలో 76 శాతం మంది మహిళలకు ఈ పథకం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సమావేశంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్స్) ఎ.అప్పలరాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఇంజినీరింగ్) టి.చెంగలరెడ్డి, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతం

విశాఖ లీగల్ : క్రీడలు మనుషుల మధ్య పోటీ తత్వాన్ని పెంచి మంచి ఫలితాలు అందిస్తాయని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా క్రీడా సాంస్కృతిక వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ న్యాయవాదులు నిరంతర కార్యశీలురని, వారికి ఆటవిడుపుగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం చాలా అవసరమన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య మంచి వాతావరణాన్ని కలిగించడానికి ఈ వేడుకలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సిరిపురపు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈత పోటీల్లో జాతీయ స్విమ్మర్ న్యాయవాదుల సంఘం క్రీడా సాంస్కృతిక సంఘం కార్యదర్శి బాలాజీ, సంఘం సీనియర్ సభ్యుడు ఆడారి అప్పారావు, భారీ సంఖ్యలో న్యాయవాదులు న్యాయమూర్తులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్‌ని సత్కరిస్తున్న జిల్లా న్యాయమూర్తి రాజా, న్యాయమూర్తులు, న్యాయవాదులు

కూటమి పాలనలో బీసీలపై దౌర్జన్యాలు

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడిని ఖండించిన వైఎస్సార్ సీపీ నేతలు



పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సమన్వయకర్తలు వాసుపల్లి, మొల్లి అప్పారావు

దాభాగార్డెన్స్: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారానికి వెళ్లిన బీసీ నేత, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రాముపై టీడీపీ గూండాల దాడిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర భరత్ ఆధ్వర్యంలో జరిగిన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొన్నారు. గ్రీన్‌పార్కు హోటల్ వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కూటమి సర్కార్ ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి బీసీలపై టీడీపీ గూండాలు దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ.. ఒక శాసనమండలి సభ్యుడికి పోలీసులు కనీస భద్రత కల్పించలేని స్థితిలో ఉంటే.. అసలు మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామా.? నియంత పాలనలో ఉన్నామా.? అనే సందేహం కలుగుతోందన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో గెలిచే సత్తా లేకపోవడంతో.. రౌడీయిజంతో ఎన్నికలో గెలవాలని చూస్తున్నారని ఆక్షేపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ, ముఖ్యనేతలు డాక్టర్ జహీర్ అహ్మద్, కార్పొరేటర్లు పీవీ సురేష్, బిపిన్‌కుమార్ జైన్, పల్లా దుర్గారావు, బోని శివరామకృష్ణ, తుళ్లి చంద్రశేఖర్ యాదవ్, అల్లంపల్లి రాజుబాబు, మారుతిప్రసాద్, ఎం.రమేష్, కనక రెడ్డి, పీతల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో నీటికి కటకట

వార్డుల్లో నీరులేక రోగుల ఇక్కట్లు

మహారాణిపేట : కేజీహెచ్‌లో గురువారం గుక్కెడు నీటి కోసం రోగులు తహతహలాడారు. ఆస్పత్రికి పలు ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్న మోటార్లు మరమ్మతులకు గురవడంతో పలు వార్డులకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కార్డియాలజీ, పరిపాలన భవనం, పాత ఎస్–4 వార్డు, ఓపీ నెంబర్ 24 తదితర వాటికి పూర్తిగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో రోగులకు తాగడానికి, ఇతర వినియోగానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ యు.శ్రీహరి తదితరులు జోక్యం చేసుకొని రోగులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. జీవీఎంసీ నుంచి నీరు తీసుకురావడానికి కృషి చేశారు.

భూ సేకరణ, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు

- 2026 నాటికి పూర్తి స్థాయిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి
- వివిధ సమీక్ష సమావేశాల్లో కలెక్టర్ హరేందిర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, చిత్రంలో డీఆర్వో భవానీశంకర్

మహారాణిపేట: జిల్లాలో మెట్రో రైల్, రైల్వే లైన్ విస్తరణ, గ్యాస్ పైప్‌లైన్, మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధి, కన్వేయన్స్ డీడ్ పట్టాలు పొందిన లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ తదితర అంశాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, రెవెన్యూ అధికారులతో వేర్వేరుగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులకు భూసేకరణతోపాటు, పరిహారం కూడా త్వరగా అందించాలన్నారు. పెందుర్తి, సింహాచలం నార్త్ స్టేషన్ మధ్య నిర్మించాల్సిన ఫ్లైఓవర్ నిర్మాణం, దువ్వాడ సింహాచలం లైన్ల మధ్య చేపట్టాల్సిన అభివృద్ధి పనుల భూ సేకరణపై చర్చించారు. విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేజ్–1లో భాగంగా మూడు కారిడార్లలో చేపట్టనున్న పనులకు సంబంధించి ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఇంకా మిగిలి ఉన్న ఐవోసీ గ్యాస్ పైప్ లైన్ల ఏర్పాటుకు జీవీఎంసీ, వీఎంఆర్డీఏతో అధికారులు సహకరించి పెండింగ్ అనుమతులు త్వరగా మంజూరు చేయాలన్నారు.

- వీఎంఆర్డీఏ పరిధిలో చేపట్టాల్సిన 25 మాస్టర్ ప్లాన్ రోడ్లపై సమీక్షించారు. భూ సేకరణ, టెండర్లు, టీడీఆర్‌ల జారీని పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభించి, 2026 జూన్/జూలై నాటికి రోడ్లను అందుబాటులోకి తీసుకొచ్చేలా చూడాలన్నారు.
- వివిధ మార్గాల్లో కన్వేయన్స్ డీడ్ పట్టాలు పొందిన లబ్ధిదారులకు వేగంగా రిజిస్ట్రేషన్లు చేయాలని జోనల్, మండల స్థాయి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రోజుకు 30 రిజిస్ట్రేషన్లు చేయాలనే లక్ష్యం పెట్టుకుని, రెండు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.30, 45ల ద్వారా నిర్వహిస్తున్న భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియతోపాటు వీటికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జీవో నెం.296 ప్రకారం పట్టాలు పొందిన లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ల గురించి ఆరా తీశారు. సమావేశాల్లో వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవోలు సంగీత మాధూర్, శ్రీలేఖ, భూ సేకరణ అధికారులు, తహసీల్దార్లు, ఐవోసీఎల్, మెట్రో రైల్, రైల్వే, జీవీఎంసీ, ల్యాండ్ సెక్షన్, యూఎల్‌సీ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చవితి నవరాత్రులకు పోలీస్ ఆంక్షలు



అల్లిపురం: రాబోయే వినాయక చవితి నవరాత్రులకు పలు ఆంక్షలు, బందోబస్తు ఏర్పాటుకు నగర పోలీసులు సిద్ధమయ్యారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నవరాత్రుల కమిటీలు పెరిగే అవకాశం ఉందని భావించి, పోలీస్ శాఖ కార్యాచరణ వివరించేందుకు సీపీ శంఖబ్రత బాగ్చి ఉత్సవ నిర్వహణ కమిటీలతో గురువారం సమావేశమయ్యారు. సీపీతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొని చవితి నవరాత్రుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మండపాల ఏర్పాటు, నిమజ్జనం, పోలీస్, ఇతర శాఖల అనుమతులు తదితర అంశాలపై చర్చించారు. నగర పరిధిలో చవితి నవరాత్రులు నిర్వహిస్తున్న కమిటీలు పోలీస్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మండపాల్లో సీసీటీవీ ఫుటేజ్ 24/7 రికార్డ్ చేసి పర్యవేక్షించాలన్నారు. సోషల్ మీడియా పుకార్లను నమ్మి, ఫార్వర్డ్ చేయొద్దన్నారు. అలాంటి సమాచారం ఉంటే పోలీసులకు వాట్సాప్ 7995095799, 100, 112 నంబర్లకు తెలియజేయవచ్చన్నారు. బలవంతంగా డొనేషన్ల వసూలు, లక్కీ డిప్స్, లాటరీలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. నవరాత్రులతోపాటు నిమజ్జనం సమయంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు.

7 జట్లు.. 25 మ్యాచ్‌లు

- నేటి నుంచి ఏపీఎల్ సీజన్ ప్రారంభం
- కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్ మధ్య తొలి మ్యాచ్



ఏపీఎల్ ట్రోఫీతో ఏడు జట్ల కెప్టెన్లు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) నాలుగో సీజన్‌కు వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. శుక్రవారం ప్రారంభం కానున్న టీ20 లీగ్‌లో ఈసారి ఏడు ఫ్రాంచైజీ జట్లు ట్రోఫీ కోసం పోటీపడనున్నాయి. మొత్తంగా 25 మ్యాచ్‌లు నిర్వహించనుండగా టైటిల్ పోరు ఈనెల 23న జరగనుంది. రోజుకు రెండు మ్యాచ్‌లు చొప్పున జరగనుండగా అభిమానులకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు ఏపీఎల్ నిర్వాహక కమిటీ చైర్మన్ వీఎస్‌కే రంగారావు తెలిపారు. సినీనటుడు వెంకటేష్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రారంభ వేడుకలో సినీనటి ప్రజ్ఞాజైస్వాల్, మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్ ప్రదర్శన ఇవ్వనుండగా డ్రోన్, లేజర్‌షో అలరించనున్నాయి. ప్రారంభ వేడుకకు కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు హాజరై కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్ మధ్య మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించనున్నారు. ఈ మ్యాచ్‌లను సోనీ స్పోర్ట్స్ లైవ్ అందించనుంది.

క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో పుదుచ్చేరి మాజీ సీఎం



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న నారాయణస్వామి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాన్ని అధికారులు అందజేశారు.

అప్పన్న ఆభరణాల తనిఖీ వాయిదా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి దాతలు సమర్పించిన ఆభరణాలు, బంగారు, వెండి ఇతర విలువైన వస్తువుల తనిఖీ వాయిదా పడింది. వాటిని పరిశీలించేందుకు ఐదుగురు సభ్యుల కమిటీ ఈనెల 7, 8 తేదీల్లో సింహగిరికి వస్తుందని తొలుత ప్రచారం జరిగింది. కానీ ఆ కమిటీ పర్యటన వాయిదా పడింది. కాగా కమిటీ వస్తుందని భావించిన దేవస్థానం అధికారులు ముందుగానే రికార్డులు భద్రపరిచారు.

మూడో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ ప్రారంభం

మహారాణిపేట: జిల్లాలో మూడో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ కార్యక్రమానికి అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఈనెల ఒకటో తేదీ నుంచి మూడో విడత కార్యక్రమం మొదలైందని అర్హులంతా వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కోరారు. రెండో విడత ఏప్రిల్ నుంచి జులై వరకు మొత్తం 3,58,380 మంది లబ్ధిదారులకు రూ.29.95 కోట్లు బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశామన్నారు.

నేడు టీటీడీ ఆలయంలో సౌభాగ్యం

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సౌభాగ్యం అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, గాజులు, కంకణాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

నవోదయలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొమ్మాది : నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తును www.navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి లేదా కొమ్మాది విద్యాలయం నుంచి పొందవచ్చని పేర్కొన్నారు.

మరణించీ.. జీవిద్దాం!

- అవయవదానంతో ప్రాణదానం
- పదేళ్లలో నగరంలో 162 మంది అవయవదానం
- నాలుగేళ్లుగా పెరుగుతున్న అవగాహన
- ఈ నెల 7 నుంచి 13 వరకు ప్రపంచ అవయవదాన అవగాహన వారోత్సవాలు



అవగాహన కార్యక్రమంలో జీవన్ దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు



అవయవ దానం చేసిన బ్రెయిన్ డెడ్ వ్యక్తికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్(ఫైల్)

బీచ్‌రోడ్డు: భౌతిక శరీరానికి ప్రాణం ఉన్నంత వరకే విలువ. ఇది ఒకప్పటి మాట. శవాన్ని పార్థివ దేహంగా చెప్పుకునేలా, మరణించాక.. మరో శరీరంలో బతికేందుకు ఉన్న ఏకైక అవకాశం అవయవదానం. సామాన్యులు సైతం అవయవదానంతో ఎందరికో పునర్జీవితమిచ్చి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు. ప్రపంచ అవయవ దాన వారోత్సవాల సందర్భంగా ఈ ప్రత్యేక కథనం.

ఎనిమిది మంది బతుకుల్లో వెలుగు

మెదడు పనిచేయకుండా ఆగిపోయిన స్థితిని బ్రెయిన్ డెడ్‌గా పేర్కొంటారు. అలాంటి వ్యక్తి ఎక్కువ రోజులు బతకడం అసాధ్యం. ఇలా బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి 110 వరకు అవయవాలను సేకరించవచ్చు. ప్రస్తుతం మన వద్ద ఉన్న సాంకేతికత ఆధారంగా 8 అవయవాల్ని మాత్రమే తీసుకుంటున్నారు. గుండె, కాలేయం, కిడ్నీలు(2), చిన్నపేగు, ఊపిరితిత్తులు(2), పాంక్రియాస్‌ను బ్రెయిన్ డెడ్ వ్యక్తి నుంచి తీసుకోవచ్చు. కార్నియా, గుండె కవాటాలు, చర్మం, ఎముక కణజాలం, రక్తనాళాలను మాత్రం సహజ మరణం పొందిన వారి నుంచే ఎక్కువగా స్వీకరిస్తారు.

సమయం చాలా తక్కువ..

దాత శరీరం నుంచి తీసిన అవయవాలను అవసరమైన వ్యక్తులకు అమర్చేందుకు ఉండేది కేవలం గంటల సమయమే. అందుకే గ్రీన్ చానల్ ద్వారా వీటిని తరలిస్తారు. గుండె, ఊపిరితిత్తులను బయటకు తీశాక 4 గంటలే వ్యవధి ఉంటుంది. కిడ్నీలకైతే 30 గంటలు, లివర్, పాంక్రియాస్‌ను 12 గంటల్లోపు మరొకరిలో అమర్చాలి. అందరిలోనూ అన్ని సమయాల్లో ఇదే సమయం ఉంటుందని చెప్పలేం. కొన్ని సందర్భాల్లో ఇంత కంటే తక్కువ సమయంలోనే ఆ అవయవాలను అమర్చాలి. లేకుంటే దాన్ని అమర్చాక సదరు వ్యక్తి రోగ నిరోధక వ్యవస్థ దాన్ని తిరస్కరిస్తూ అవయవంపై దాడి చేస్తుంటుంది. అందుకే దాన్ని బ్లాక్ చేసేందుకు మందులిస్తారు. కొన్నిసార్లు ఈ మందులు జీవిత కాలం వాడాల్సి రావొచ్చు.

విశాఖలో అవయవ దాతలు (2015 నుంచి 2025 జూన్ వరకు)

ఆస్పత్రి పేరు	దాతలు
కిమ్స్ ఐకాన్	60
కేర్(రామ్‌నగర్)	35
అపోలో(హెల్త్ సిటీ)	28
మెడికవర్	16
సెవెన్ హిల్స్	6
క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ	5
పినాకిల్	5
విమ్స్	3
అపోలో(రామ్‌నగర్)	2
ఓమ్ని	1
కేర్ హెల్త్ సిటీ	1

అవగాహన పెరగాలి

మన దేశంలో మూఢ నమ్మకాల కారణంగా అవయవాలు దానం చేసేందుకు చాలా మంది ముందుకురాని పరిస్థితి. ఒక్క మన రాష్ట్రంలోనే జీవన్ దాన్ ద్వారా అధికారికంగా అవయవాల కోసం 5 వేల మంది ఎదురు చూస్తున్నారు. ప్రజల్లో అవయవదానం పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందులో భాగంగా ఏటా ఆగష్టు 7 నుంచి 13 వరకు ప్రపంచ అవయదాన అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. దీంతో నాలుగేళ్లలో బ్రెయిన్ డెడ్ కేసులు గణనీయంగా పెరిగి, అవయవ దానానికి కుటుంబ సభ్యులు ఆమోదం తెలుపుతున్నారు.

అధికార లాంఛనాలతో అంతిమ వీడ్కోలు

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను దానం చేస్తే రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంచనాలతో అంతిమ వీడ్కోలు పలుకుతుంది. దహనసంస్కారాల కోసం రూ.10 వేలు తక్షణ సాయం అందిస్తుంది. ప్రశంసా ప్రతం అందించి, కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరిస్తుంది.

బతికున్నప్పుడే చేసే అవయవ దానాలు

ఒక మనిషి తన జీవనానికి పెద్దగా ప్రభావం లేకుండా కూడా కొన్ని అవయవాలను దానం చేయొచ్చు. కిడ్నీల్లో ఒకటి, ఊపిరితిత్తులు, కాలేయం, పాంక్రియాస్, పేగు నుంచి కొంత భాగాన్ని నిక్షేపంగా దానం చేయొచ్చు. కొంత భాగం దానం తర్వాత కూడా కణాల వృద్ధి జరిగి, కణజాలం నిర్మితమయ్యే అవకాశం ఉన్న ఏకైక అవయవం కాలేయం. రక్తం, రక్తంలో ప్లేట్‌లెట్స్, మూల కణాలు కూడా దానంగా ఇవ్వదగినవే..!

అవయవ దానం చేయాలంటే..

అవయవ దానానికి సమ్మతించిన వారు లిఖిత పూర్వక హామీనిస్తూ ఆస్పత్రులు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే జీవన్‌దాన్ సంస్థలో పేర్లు నమోదు చేసుకోవాలి. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఖచ్చితంగా చెప్పాలి. ఎందుకంటే ఆ వ్యక్తి మరణానంతరం అవయవ దానానికి సమ్మతించాల్సింది కుటుంబ సభ్యులే. మొత్తం శరీరాన్ని వైద్య పరీక్షల కోసం దానం చెయ్యడానికి అంగీకరిస్తే మరణానంతరం ఆ ప్రక్రియను పూర్తి చేసేందుకు ముందే ఓ వ్యక్తిని నియమించుకోవాలి.

ప్రభుత్వ ఆసుపత్రులపై దృష్టి



బ్రెయిన్ డెడ్ కేసులు ఉన్నప్పటికీ అవయవాల సేకరణకు కొన్ని ఆస్పత్రులు ఆసక్తి చూపట్లేదు. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో బ్రెయిన్ డెడ్ కేసులు ప్రకటించట్లేదు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవాలు సేకరించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కేజీహెచ్‌లో జీవన్‌దాన్ కోసం బృందాలను సిద్ధం చేశాం. ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రతి ఆస్పత్రిలో సైన్ బోర్డులు, హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయనున్నాం.

– డాక్టర్ కె.రాంబాబు, జీవన్‌దాన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్

జైల్ పూర్వ అధికారులపై దర్యాప్తు

ఇద్దరు అధికారుల్ని నియమించిన జైళ్ల శాఖ

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో గతంలో పని చేసిన అధికారులపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా జైళ్ల శాఖ ఇద్దరు అధికారులను దర్యాప్తునకు నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ కేంద్ర కారాగారంలో గతంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎస్.కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, ప్రస్తుతం పనిచేస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ కె.జవహర్‌బాబు, జైలర్లు సీహెచ్ శ్రీనివాస్, పి.కుశకుమార్, ఆర్.చిన్నారావు, ఐ.మురళి, ఎ.ఈశ్వరరావు, గూడూరు కేంద్ర కారాగారంలో అటాచ్‌మెంట్‌పై జైలర్‌గా పనిచేస్తున్న టి.దుర్గారావులపై చార్జ్ మెమోలున్నాయి. దుష్ప్రవర్తన, విధుల్లో నిర్లక్ష్యం, ప్రధాన కార్యాలయం, రేంజ్ కార్యాలయాల ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం తదితర అభియోగాలపై చార్జ్ మెమోలు జారీ చేశారు. దీనిపై ప్రస్తుతం దర్యాప్తు చేపట్టేందుకు జైళ్ల శాఖ గుంటూరు రేంజ్ డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్, అనంతపురం జైల్(అగ్రికల్చర్ కాలనీ) సూపరింటెండెంట్ బి.చంద్రశేఖర్‌లను దర్యాప్తు అధికారులుగా నియమించారు. వీరిద్దరు త్వరలో వీరిపై దర్యాప్తు చేపట్టనున్నారు. దర్యాప్తు అనంతరం సేకరించిన ఆధారాలతో నివేదికను జైళ్ల శాఖ ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.

19న ఫొటో జర్నలిస్టుల ఎగ్జిబిషన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, చిత్రంలో ఫొటోగ్రాఫర్లు

మహారాణిపేట: వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు వై. రామకృష్ణ, కార్యదర్శి ఎం.డి. నవాజ్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబుతో కలిసి జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆవిష్కరించారు. 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ మ్యూజియంలో 19, 20 తేదీల్లో ఎగ్జిబిషన్ జరుగుతుందని అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌కు తెలిపి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫొటో ఎగ్జిబిషన్‌కు సందర్శకులు, విద్యార్థులు హాజరవుతారు కనుక సందేశాత్మకంగా, ఆకర్షణీయంగా ఉండే ఫొటోలు ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫొటో జర్నలిస్టులు పి.ఎల్.మోహన్‌రావు, పెద్దిరాజు, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రజలందరినీ ఐక్యం చేస్తుంది

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోడ రఘురామ్



ఏయూ శతాబ్ది వేడుకల్లో హైకోర్టు మాజీ న్యాయమూర్తి గోడ రఘురామ్, యార్లగడ్డ

మద్దిలపాలెం: రాజ్యాంగం దేశ ప్రజలందరినీ ఐక్యం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ(భోపాల్) మాజీ డైరెక్టర్ జస్టిస్ గోడ రఘురామ్ తెలిపారు. ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో గురువారం జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఎండోమెంట్ లెక్చర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన చట్టం, సామాజిక క్రమం రాజ్యాంగ దృక్పథం అనే అంశంపై ఉపన్యసించారు.

విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు విభిన్న అంశాలపై అవగాహన అందించేందుకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ శతాబ్ది సంవత్సరంలో ఉన్న ఏయూ ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించేలా క్యాలెండర్‌ను విడుదల చేసిందన్నారు. లా కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం న్యాయ కళాశాల ప్రత్యేకతలను, ఎండోమెంట్ లెక్చర్ వివరాలు వివరించారు. ముందుగా న్యాయ కళాశాల వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకొని న్యాయ కళాశాలలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. విశ్రాంత ఆచార్యులు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్లకు శ్రావణ శోభ



పత్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

జగదాంబ: శ్రావణమాసం మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నగరం శ్రావణ శోభను సంతరించుకుంది. నగరంలో పూర్ణామార్కెట్, రైతుబజార్లు కిక్కిరిసిపోయాయి. కంచరపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, అక్కయ్యపాలెం, మధురవాడ, సీతమ్మధార తదితర ప్రధాన కూడళ్లలో వెలసిన దుకాణాల వద్దకు గురువారం అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో కిటకిటలాడాయి. ఇదే అదనుగా పువ్వులు, పండ్లు, ఇతర పూజా సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. 100 గ్రాముల పువ్వులు రూ.100–150 మధ్య అమ్మకాలు అమ్మకాలు జరిపారు. అరటిపండ్లు డజను రూ.100కు చేరింది. కొబ్బరికాయలు పరిమాణంలో కాస్త మధ్యస్తంగా ఉన్నవి ఒక్కోటి రూ.50 ధర పలికింది. ఇక పండ్ల ధరల గురించి చెప్పాల్సిన పనిలేదు. కిలో దానిమ్మ రూ.300, యాపిల్ రూ.250, ద్రాక్ష రూ.200, సీతాఫలాలు ఒక్కొక్కటి రూ.40–50 మధ్య విక్రయించారు. పత్రులు, గాజుల దుకాణాలు ఎక్కడికక్కడ వెలిశాయి. ప్రధాన మార్కెట్ల వద్ద జనం కిక్కిరిసిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పూర్ణా మార్కెట్ వద్ద బారికేడ్లతో రహదారిని డైవర్ట్ చేయాల్సి వచ్చింది.

మేయర్ తీరు వల్లే క్రాస్ ఓటింగ్

కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు ప్రధాన కారణం మేయర్ పీలా శ్రీనివాసరావు అని 39వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మేయర్ ప్రవర్తన నచ్చక కొంతమంది కార్పొరేటర్లు తమ అసంతృప్తిని స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వ్యక్తం చేశారన్నారు. మేయర్‌గా ఎన్నికైన తర్వాత ఆయన వైఖరిలో మార్పు కనిపించిందన్నారు. అదేవిధంగా కార్పొరేటర్లతో సరిగా సమన్వయం చేయలేకపోతున్నారన్నారు. కార్పొరేటర్లు తమ సమస్యలను చెప్పినా పట్టించుకోకుండా మేయర్ సొంత నిర్ణయంతో అహంకారం ధోరణితో ప్రవర్తిస్తున్నారన్నారు. మేయర్‌గా ఎన్నికైన తర్వాత జరిగిన తొలి కౌన్సిల్ సమావేశానికి నిబంధనలకు విరుద్ధంగా తన సోదరుడు పీలా గోవింద్‌ను తీసుకువచ్చారని పేర్కొన్నారు. మేయర్ తన సోదరుడిని కౌన్సిల్ సమావేశానికి తీసుకురావడం సముచితం కాదని కార్పొరేటర్లు భావించారన్నారు. ఈ నేపథ్యంలో కొందరు కార్పొరేటర్లు అసంతృప్తి బహిరంగంగానే వ్యక్తం చేసినప్పటికీ మేయర్‌లో మార్పు రాలేదన్నారు. ఇలా అసంతృప్తి చెందిన 22 మంది కార్పొరేటర్లు క్రాస్ ఓటింగ్ ద్వారా తమ నిరసనను వ్యక్తం చేశారన్నా అభిప్రాయం వ్యక్తమవుతోందన్నారు.

11 నుంచి సీజీఆర్‌ఎఫ్ క్యాంపు కోర్టులు



సీజీఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్ సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: ఏపీఈపీడీసీఎల్ శ్రీకాకుళం, అనకాపల్లి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పాడేరు సర్కిళ్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 11 నుంచి క్యాంపు కోర్టులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) ఛైర్మన్ విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ వెల్లడించారు. ఈ నెల 11న పలాస డివిజన్ కాశీబుగ్గ సెక్షన్, 13న నర్సీపట్నం డివిజన్ కోటవురట్ల సెక్షన్, 21న అమలాపురం డివిజన్ మలికిపురం సెక్షన్, 22న భీమవరం డివిజన్ ఉండి సెక్షన్, 29న రంపచోడవరం డివిజన్‌లోని రాజవొమ్మంగి సెక్షన్ కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే క్యాంపు కోర్టులో వినియోగదారులు పాల్గొనవచ్చని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులను నేరుగా సీజీఆర్‌ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అదేవిధంగా విశాఖపట్నం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్‌ఎఫ్ కార్యాలయానికి కూడా నేరుగా గానీ, లిఖిత పూర్వకంగాగానీ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించవచ్చని సూచించారు. ఈ సదస్సుల్లో ఛైర్‌పర్సన్ బి.సత్యనారాయణతో పాటు సీజీఆర్‌ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.రాజబాబు, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొననున్నారు.

పాఠశాల మూసివేత చర్యలపై ఆందోళన



పాఠశాల ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులతో నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు ఆర్పీపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధి కంచరపాలెం ప్రాథమిక పాఠశాల మూసివేతకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది వరకు 260 మంది విద్యార్థులు, 10 మంది టీచర్లుండేవారని, ఇటీవల బదిలీల్లో ఆరుగురు వెళ్లిపోవడంతో కేవలం నలుగురు టీచర్లతో నెట్టుకొస్తున్నారని ఆక్షేపించారు. ఇప్పుడున్న 206 మంది విద్యార్థులకు రెండు నెలలుగా పూర్తి స్థాయిలో తరగతులు జరగట్లేదన్నారు. విలీనం సాకుతో పాఠశాలను మూసేయడానికి విద్యాశాఖ చేస్తున్న ప్రయత్నాలను తల్లిదండ్రులు ధర్నాలు, రాస్తారోకో, నిరసనలతో అడ్డుకుంటున్నా అధికారుల్లో మాత్రం ఎలాంటి దిద్దుబాటు చర్యలు కానరావట్లేదని ఆక్షేపిస్తున్నారు. ఈ నెల 11 నుంచి ఫార్మేటివ్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో టీచర్ల కొరతపై వార్డు మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ నాగమణి నేతృత్వంలో గురువారం తల్లిదండ్రులు పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులను బయటకు పంపడంతో.. వారు తమ పిల్లల్ని తీసుకుని పాఠశాల ప్రధాన ద్వారం వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో కంచరపాలెం సబ్ ఇన్‌స్పెక్టర్ సమీర్, కానిస్టేబుల్ రాంబాబు పాఠశాలకు చేరుకుని విద్యార్థులను పాఠశాల లోపలికి పంపారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజ్యలక్ష్మి సమక్షంలో ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాలకు డిప్యుటేషన్‌పై టీచర్లను పంపాలన్న డిమాండ్ నేపథ్యంలో ఒకరిని నియమించడంతో తల్లిదండ్రులు శాంతించారు. ఈ సందర్భంగా బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రజా వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. ఈ స్కూల్‌ను తరలించినా, మూసేయడానికి ప్రయత్నించినా రాష్ట్ర ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. డీఎస్సీ ఫలితాలను ప్రకటించి, కొత్త ఉపాధ్యాయులను స్కూల్‌కు కేటాయించి, పాఠశాలకు పూర్వవైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని తల్లిదండ్రులు ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ సభ్యులు హెచ్చరించారు.

వేపగుంటలో రెచ్చిపోయిన రౌడీలు

- గంగిరెడ్ల కాలనీలో యువకుడిపై బీరు బాటిళ్లతో హత్యాయత్నం
- గంట వ్యవధిలోనే ముగ్గురు నిందితుల అరెస్ట్

పెందుర్తి: వేపగుంట సమీపంలోని గంగిరెడ్ల కాలనీలో గురువారం సాయంత్రం రౌడీలు రెచ్చిపోయారు. వ్యక్తిగత కక్షలతో ఓ యువకుడిపై బీరు బాటిళ్లతో దాడికి చేసి, హతమార్చేందుకు ప్రయత్నించారు. బాధితుడి కుటుంబ సభ్యులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వడం, ఘటనాస్థలికి సమీపంలోనే బ్లూకోట్స్ పోలీసులు ఉండడంతో యువకుడిని రక్షించారు. పోలీసులను చూసి పరారైన నిందితులు ముగ్గురు గంట వ్యవధిలోనే పట్టుబడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. కాలనీలో ఉంటున్న బి.ప్రదీప్‌కుమార్(22)కు అదే కాలనీకి చెందిన ధనకొండ చిన్నోడు(21), సీరం రాజేష్(21), మొండి బ్రహ్మయ్య(21)లతో విభేదాలున్నాయి. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ప్రదీప్ ఇంటి వద్దకు చిన్నోడు, రాజేష్, బ్రహ్మయ్య వచ్చి బయటకు పిలిచారు. ప్రదీప్ వచ్చిన వెంటనే అతనిపై విచక్షణరహితంగా బీరు బాటిళ్లతో దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారు. దీంతో స్థానికులు, బాధితుడి కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు డయల్ 100 ద్వారా సమాచారం ఇచ్చారు. కాలనీ సమీపంలోనే ఉన్న బ్లూకోట్స్ పీసీ గోవింద్ వెంటనే అక్కడికి చేరుకుని ప్రదీప్‌ను రక్షించారు. ఈ గందరగోళంలో నిందితులు చిన్నోడు, రాజేష్, బ్రహ్మయ్య పారిపోయారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఐ కేవీ సతీష్‌కుమార్, ఎస్‌ఐ స్వామినాయుడు, బృందాన్ని గాలింపునకు ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ముగ్గురు నిందితులను గంటలో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులు ముగ్గురు గతంలో పలు నేరాల్లో భాగస్వాములుగా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రౌడీ చర్యలను తీవ్రంగా తీసుకుంటున్నామని.. శాంతిభద్రతలతో పాటు పౌరుల ప్రాణాలకు హానీ తలపెడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

హైదరాబాద్ పోలీసుల అదుపులో కేజీహెచ్ వైద్యుడు

మహారాణిపేట: సృష్టి కేసులో కేజీహెచ్‌లో ఒక వైద్యుడిని హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేజీహెచ్‌కు చెందిన ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ వి.రవిని హైదరాబాద్ పోలీసులు తీసుకొని వెళ్లారు. ఈ కేసులో ఇంకా ఇద్దరు కేజీహెచ్ వైద్యులు పేర్లు కూడా ఉన్నట్టు తెలుస్తోంది.